సాక్షి
గుంటూరు

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



హనుమాన్ చాలీసా పారాయణం

గోళ్లపాడు(ముప్పాళ్ల): మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం శనివారం నిర్వహించారు.



వరలక్ష్మి అమ్మవారి వ్రత పూజ

నగరం: మండలంలోని పెద్దవరం గౌడపాలెంలో ఉన్న శ్రీరామాలయంలో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



మార్కండేయ జయంతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో ఉన్న భద్రావతి సమేత భావనాఋషిస్వామి ఆలయంలో శనివారం మార్కండేయ జయంతి నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు


లక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి దృష్ట్యా ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు జిల్లా రెవిన్యూ అధికారి యస్.యస్.కె ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3,10,17,24, మార్చి 3వ తేదీల్లో కార్యక్రమం జరగదని ఆయన పేర్కొన్నారు. డివిజన్, మున్సిపాలిటీ, మండల స్థాయిలోనూ రద్దు చేసినట్లు తెలియజేశారు. ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉందని తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు సేఫ్టీ జాకెట్స్ వితరణ



తాడేపల్లి రూరల్: మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సేఫ్టీ జాకెట్లను శనివారం గుంటూరు పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ రామకృష్ణ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ హెడ్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 4 ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని సేఫ్టీ జాకెట్స్‌ను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జిగా లీలావతి



నగరంపాలెం: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోన్న సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి పదోన్నతిపై కర్నూలు జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీయ్యారు. రెండు రోజుల కిందట ఆమె బాధ్యతల నుంచి రిలీవయ్యారు. ఆమె స్థానంలో న్యాయసేవాధికారి సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఒకటో సబ్ కోర్టు జడ్జి గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

కృష్ణా నదిలో చేప పిల్లలు విడుదల

తాడేపల్లి రూరల్: కృష్ణా నది ఎగువ ప్రాంతం పడవల రేవు వద్ద గుంటూరు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి పి. గాలిదేవుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్‌లో రెండు ఫారంల నుంచి సేకరించిన 7.20 లక్షల చేప పిల్లలను వదిలామని తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి తహసీల్దార్ డి. సీతారామయ్య, మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది, సొసైటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మంగళగిరి కొండపై అగ్ని ప్రమాదం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని ఎగువ నరసింహస్వామి, గండాలయ స్వామి దేవస్థానం కొండపై శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. అవి దిగువ ప్రాంతానికి కూడా వ్యాపిస్తుండడంతో నివాసితులు ఆందోళన చెందుతూ అధికారులకు ఫోన్లు చేశారు. సహజంగా ఎప్పుడూ చెలరేగే మంటలే కదా అంటూ నిర్లక్ష్యం వహించడంతో అక్కడి ప్రజలు మరింత భయాందోళనకు గురయ్యారు. చివరకు రెండు గంటల అనంతరం తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు.

స్క్రీనింగ్ క్యాంపు వాయిదా

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధులకు ఉపకరణాలు అందించేందుకు ఫిబ్రవరి 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించాల్సిన స్క్రీనింగ్ క్యాంపులు వాయిదా వేసినట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్. సువార్త శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తిరిగి క్యాంపులు నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని వెల్లడించారు.

పైసా విదల్చని నిర్మలమ్మ



- కనికరించని ఆర్థిక మంత్రి నిర్మల
- బడ్జెట్‌లో రాజధానికి మొండిచెయ్యి
- జాతీయ పత్తి మిషన్ ప్రకటనపై స్పష్టత కరువు
- ఆదాయ పన్ను సీలింగ్ పెంచటంతో వేతన జీవులకు ఊరట
- కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంపుతో రైతులకు ఉపయోగం లేదు

నిర్మలమ్మ బడ్జెట్ అంతా కొత్త సీసాలో పాత సారాగా ఉంది. పెద్దగా మెరుపులు లేవు. జిల్లాకు నిధులు కూడా అరకొరగా కేటాయించారు. కేంద్రంలోని బీజేపీతో అంటకాగుతున్న కూటమి ప్రభుత్వం వల్ల రాజధానికి నిధులు వరద వస్తుందని ప్రజలు భావించారు. తీరా పైసా కూడా విదల్చకపోవడంతో జిల్లా అభివృద్ధికి గండి పడింది. ఆదాయపు పన్ను మినహాయింపు పెంపుదలతో మాత్రం జిల్లాలో 30వేల ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుంది .


సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాపై నిర్మలమ్మ శీతకన్ను వేసింది. కేంద్ర బడ్జెట్‌లో రాజధానికి ఒక్కపైసా కూడా కేటాయించకుండా మొండిచెయ్యి చూపింది. రాజధానికి కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు వస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటూ వచ్చినా బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా కేటాయించలేదు. బడ్జెట్‌పై జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. రాజధానికి ప్రపంచ బ్యాంకు ఇచ్చే గ్రాంటు నిధుల గురించి ప్రస్తావనే లేదు.

ఉద్యోగులకు పన్నులో ఆదా

మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలు చాలాకాలంగా ఎదురు చూస్తున్న ఆదాయపున్ను మినహాయింపు పెంపుదలపై కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించడంతో వేతన జీవుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఏడాదికి రూ.12.75 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో ఉద్యోగులకు రూ.75వేలు వరకు పన్ను ఆదా అవుతుంది. జిల్లాలో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగుల్లో సుమారు 30 వేలమందికి లబ్ధి చేకూరుతుంది. సీనియర్ సిటిజన్లకు పన్ను శ్లాబుల్లో ఎటువంటి ప్రత్యేక రాయితీ ఇవ్వకపోవడంతో వారు నిరాశ చెందారు.

పత్తి రైతులకు ఊరట

పప్పు ధాన్యాలకు స్వయం సంవృద్ధి పథకాన్ని ప్రకటించింది. జిల్లాలో సుమారు 46 వేల ఎకరాల్లో మినుము, పెసర, కంది సాగు అవుతోంది. జాతీయ పత్తి మిషన్ ప్రకటించడంతో కొంత మేర రైతులకు ఊరట కలిగే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో పత్తి విస్తీర్ణం ప్రతి ఏటా తగ్గుతూ వస్తోంది. మరోవైపు సీసీఐ పత్తి కొనుగోలు చేసే విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోంది. పత్తి మిల్లులకు లాభం చేకూరేలా సీసీఐ వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పత్తి మిషన్ ఏర్పాటు వల్ల రైతులకు ఏం ఉపయోగం జరుగుతుందన్న దానిపై స్పష్టత లేదు. గుంటూరు జిల్లా పరిధిలో 26,982 హెక్టార్లలో పంట సాగు అవుతోంది. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ కేటాయింపులు నామమాత్రంగా ఉండటంతో రైతులకు పెద్దగా ఉపయోగం లేదనే చెప్పాలి.



ఎంఎస్‌ఎంఈలకు రుణ పరిమితి పెంపు

కిసాన్ క్రెడిట్ కార్డుల రుణపరిమితిని పెంచారు. దీనివల్ల రైతులను అప్పుల వైపు నెట్టడమే కాని ఆదుకునే చర్యలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 3,82,513 కిసాన్ క్రెడిట్ కార్డులున్నాయి. ఎంఎస్‌ఎంఈలకు రుణ పరిమితిని పెంచారు. గతంలో వీటికి ఐదు కోట్ల రూపాయల వరకూ పరిమితి ఉండగా తాజాగా దాన్ని పది కోట్ల రూపాయలకు పెంచారు. జిల్లాలో ఉన్న 72,094 ఎంఎస్‌ఎంఈలకు ఈ నిర్ణయం వల్ల కొంత మేర ఊరట కలగవచ్చు.

లోటు బడ్జెట్‌తో ఉపయోగం లేదు



కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన లోటు బడ్జెట్ వల్ల దేశ ప్రజలకు ఉపయోగం లేదు. బంగారంపై ఎక్సైంజ్ సుంకం తగ్గించలేదు, దానిపై ఏ ప్రకటనా చేయలేదు. ఇళ్లు నిర్మించుకునే వారికి వడ్డీ రాయితీలు ప్రకటించ లేదు. మధ్య తరగతి కుటుంబాలకు వడ్డీ రాయితీలు కల్పిస్తే వారికి హాయిగా జీవించేందుకు అవకాశం ఉంటుంది. రాజధానికి నిధుల కేటాయింపు ఊసే లేదు.

–ఆతుకూరి ఆంజనేయులు,
చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు గుంటూరు

రైతులకు మొండిచెయ్యి



పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకువచ్చిన రైతాంగ చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో ఆందోళన జరుపుతున్న రైతాంగ సమస్యలపై ఈ బడ్జెట్లో ప్రస్తావన చేయకపోవడం దుర్మార్గం. వ్యవసాయ రంగంలో కూడా కార్పొరేట్లకు అనుకూలంగా ఉండే విధంగా విధానాలు రూపొందించారు. వీటికి వ్యతిరేకంగా భవిష్యత్తులో ఆందోళన చేస్తాం.

– కె.అజయ్ కుమార్,
రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నిరాశ పర్చిన కేంద్ర బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌ను మరోసారి నిరాశపర్చింది. విభజన చట్ట హామీల అమలుకు నిధుల కేటాయించలేదు. కొత్తగా ఏ సంస్థను కూడా ప్రకటించలేదు. రాజధానికి ప్రపంచ బ్యాంకు ఇచ్చే గ్రాంటు నిధుల గురించి ప్రస్తావన లేదు. వ్యవసాయ రంగ పునరుజ్జీవనానికి తగిన చర్యలు ప్రకటించలేదు. ఉపాధిని పెంచేందుకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా చర్యలు ప్రకటించారు. అన్ని రంగాల్లో ప్రైవేటీకరణ పెద్దపీట వేశారు.

– కె.ఎస్. లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

రాష్ట్రానికి మొండి చేయి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకీ మొండి చేయి చూపించారు. 16 ఎంపీలు ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు తీసుకు రావడంలో పూర్తి వైఫల్యం చెందింది. రాష్ట్రానికి మేలు చేయాలన్న ఆలోచన కేంద్రం చేయకపోవడం దారుణం. కూటమి చేతకానితనం వల్లే ఎటువంటి కేటాయింపులు రాలేదు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందని పదే పదే చెబుతున్న చంద్రబాబు, మిత్రత్వంతో ఉన్న కేంద్రం వద్ద నిధులు ఎందుకు తీసుకుని రాలేకపోయారు? ఇదీ ఏపీకి తీరని అన్యాయం చేసిన బడ్జెట్.

– లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ

ఆంధ్రప్రదేశ్‌కు నిరాశ



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిరాశ కలిగించారు. బిహార్‌కు నిధులు, ప్రాజెక్టుల వరద పారించారు. రాష్ట్రంలో అమరావతి, మెట్రో రైలు ప్రాజెక్టుల ఊసే ఎత్తలేదు. వృద్ధులకు బాండ్లపై పన్ను వెసులుబాటు కల్పించారు. అయితే, 70 ఏళ్లు పైబడినవారికి పూర్తిగా వెసులుబాటు కల్పిస్తే బాగుండేది. వ్యవసాయానికి రూ.1,71,437 కోట్లు కేటాయించినా, యువత సేద్యం వైపు మొగ్గు చూపేందుకు ప్రత్యేకంగా ఏ పథకం లేదు. గ్రామీణాభివృద్ధికి కేటాయించిన రూ.2,66,817 కోట్లు బొటాబొటిగా సరిపోతాయి. విద్యారంగానికి కేటాయింపులు అంతంతమాత్రమే. దేశంలో మధ్యతరగతి వారికి 40 వేల ఇళ్లు ఏ మాత్రం సరిపోవు. ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడంలో అంకెల గారడీ కనిపిస్తోంది. మొత్తం మీద కేంద్ర బడ్జెట్ అంత ఆశాజనకంగా లేదు.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి,
ఉప కులపతి, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం

గుంటూరు నగరంలో టీడీపీ
దిగజారుడు రాజకీయాలు



సమావేశంలో మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, మోదుగుల, లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి తదితరులు

వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర పాలకసంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ నేతలు, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను అడ్డగోలుగా కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో అంబటి మాట్లాడారు. కేవలం 11 సీట్లు ఉన్న కూటమి, ఎన్నికల ముందు కొంత మంది కార్పొరేటర్లను కొనుగోలు చేసిందని, ఇప్పుడు స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి కక్కిన కూటికి ఆశపడుతోందని విమర్శించారు. తాము క్యాంపు పెట్టుకుని కార్పొరేటర్లను టీడీపీ నుంచి కాపాడుకుంటుంటే.. అసలు ఏ మాత్రం బలం లేని టీడీపీ ఎందుకు క్యాంపు పెట్టిందని ప్రశ్నించారు. ప్రలోభాలకు గురి చేసి కార్పొరేటర్లను భయపెట్టి, బెదిరించి వారి పక్షాన లాక్కుంటున్నారని దుయ్యబట్టారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల కార్పొరేటర్లు అయిన ప్రతి ఒక్కరూ రేపు జరిగే ఎన్నికల్లో వారి అంతరాత్మ ప్రబోధించిన విధంగా ఓటు వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

- ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ వ్యవహరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు పదే పదే విలువల గురించి మాట్లాడుతూ ఆయన పాటించడం లేదని విమర్శించారు. అసలు ఏ మాత్రం మెజారిటీ లేకుండా ఎన్నికల్లో నామినేషనుల ఎలా వేస్తారని ప్రశ్నించారు. స్పష్టంగా వారికి అవకాశం లేదని తెలిసి, ఎన్నికల్లో నిలబడటమంటే..అక్రమం కాదా చంద్రబాబు ? అని మండిపడ్డారు. గుంటూరు కార్పొరేషన్ చరిత్రలో ఎన్నడూ ఇటువంటి నీచ రాజకీయాలు జరగలేదని, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను ఏ విధంగా చేర్చుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు.
- పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ అధికారం ఉందనే అహంకారంతో టీడీపీ క్యాంపు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. టీడీపీ నుంచి రక్షణ లేదు కాబట్టే...క్యాంపు నిర్వహించాల్సిన పరిస్థితి తమకు వచ్చిందని తెలిపారు. అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని, ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు ఇటువంటి చిన్న పదవుల కోసం రాజకీయాలు చేయటం సిగ్గుచేటని ఖండించారు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం వారి పార్టీ నుంచి గెలిచిన వారిని పక్కకు రమ్మని చెప్పాలని, వైఎస్సార్ సీపీ నుంచి కొనుగోలు చేసిన అంశం గురించి మాట్లాడి తన నిజాయతీ చాటుకోవాలని కోరారు. పవన్ కల్యాణ్ తన వద్ద ఉన్న ఇద్దరిని వెనక్కి పిలిస్తే.. ఆయన వద్ద విలువులు నేర్చుకుంటామని తెలిపారు. చంద్రబాబు అండ్ కో స్టాండింగ్ కమిటీపై వెచ్చించిన సమయం నగరాభివృద్ధికి కేటాయిస్తే బాగుటుందని సూచించారు.
- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు గానూ వైఎస్సార్ సీపీకి పూర్తి మెజారిటీ ఉందని తెలిపారు. టీడీపీ, కూటమి నేతలు గెలుపు కోసం చేస్తున్న రాజకీయాలు, సంఖ్యా బలం లేకపోయినా వ్యవహరిస్తున్న తీరు ఏ మాత్రం సరికాదని ఖండించారు.

గేమ్ చేంజర్

ఆ బాలిక వయసు పదమూడేళ్లు. తల్లిదండ్రులిద్దరూ వైద్యులు. ఆర్థికంగా లోటులేని కుటుంబం. ప్రేమానురాగాల మధ్య గారాల పట్టీగా పెరగాలి. అయితే, పరిస్థితుల ప్రభావంతో తండ్రి దూరమయ్యాడు. బిడ్డ కోసమని వైద్య వృత్తిని వదులుకుని, దగ్గరే ఉంటున్న తల్లిని మూడేళ్ల కిందట గుండెజబ్బు బలి తీసుకుంది. అమ్మమ్మ, తాతయ్యల లాలనలో పెరుగుతూ ఆ బాలిక అటు చదువులోనూ, ఇటు క్రీడల్లోనూ రాణిస్తోంది. ఏకంగా అంతర్జాతీయ పోటీల్లో పతకాలను సాధించింది. కష్టాలు దాటి విజయాలు సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆ బాలికే తెనాలి రూరల్ మండలం కఠెవరం గ్రామానికి చెందిన కె.యుక్తాశ్రీ.

- జంప్ రోప్‌లో సత్తా చాటుతున్న యుక్తాశ్రీ
- తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన బాలిక
- అమ్మమ్మ, తాతయ్య లాలనలో క్రీడా సాధన
- ఐదు జాతీయ పోటీల్లో నాలుగింటిలో పతకాలు
- తాజాగా అంతర్జాతీయ పోటీల్లోనూ రెండు మెడల్స్

తెనాలి: స్థానిక వెస్ట్‌బెర్రీ స్కూలులో కె.యుక్తాశ్రీ ఎనిమిదో తరగతి చదువుతోంది. నేపాల్‌లోని పోకర్‌లో ఈ నెల 5–8వ తేదీల్లో జరిగిన ఇండో–నేపాల్ జంప్ రోప్ చాంపియన్‌షిప్–2025లో దాదాపు పది దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఇండియా నుంచి 50 మందితో కూడిన జట్టు ఈ పోటీలకు హాజరైంది. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 28 మంది పాల్గొనగా, గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరిలో యుక్తాశ్రీ ఒకరు. అండర్–14 విభాగంలో పోటీపడిన ఈ చిన్నారి, 75 సెకన్ల ఎల్ఆర్ఎస్ గ్రూప్ ఈవెంట్‌లో బంగారు పతకం, డబుల్ అండర్‌లో వ్యక్తిగత కాంస్య పతకాన్ని సాధించింది.

నిత్యం సాధన

నంద్యాల చెందిన కోచ్ ఫకీరయ్య గతేడాదిగా శిక్షణనిస్తున్నారు. రోజూ సాయంత్రం ఆన్‌లైన్‌లో జంప్ రోప్‌లో మెలకువలను బోధిస్తున్నారు. వీకెండ్స్‌లో కఠెవరం వచ్చి, యుక్తాశ్రీకి ఇంటిలోనే శిక్షణ ఇస్తున్నారు. కఠెవరంలోనే కొందరు పూర్వ క్రీడాకారులు వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో ఔత్సాహికులకు శిక్షణనిస్తున్నారు. క్రీడలంటే ఇష్టపడే యుక్తాశ్రీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంది. క్రమం తప్పకుండా సాధన చేసింది. వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరైంది. 45 కిలోల విభాగంలో పాల్గొని క్లీన్ అండ్ జెర్క్‌లో 45 కిలోల బరువులను ఎత్తగలిగింది. పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రకటించిన రోజే, జంప్ రోప్‌లో నేషనల్స్‌కు వెళ్లాల్సి రావడంతో ఆ పోటీల్లో పాల్గొనలేకపోయినట్టు వివరించింది.



సాధనలో యుక్తాశ్రీ



అంతర్జాతీయ వేదికపై పతకాలతో జట్టు సభ్యుల మధ్య..

రెండేళ్లుగా విజయాల పరంపర

జంప్ రోప్ క్రీడలో రెండేళ్లుగా వరుస విజయాలు సాధిస్తోంది యుక్తాశ్రీ. ఇప్పటివరకు అయిదు జాతీయ పోటీల్లో పాల్గొని, నాలుగింటిలో పతకాలు కైవసం చేసుకోగలిగింది.

- తెనాలిలో గతేడాది జరిగిన జాతీయ జంప్ రోప్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది.
- గతేడాది షిర్డీలో జరిగిన పోటీల్లో గ్రూప్ ఈవెంట్‌లో రజత పతకం, 2023లో ఉజ్జయినిలో జరిగిన చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచింది.
- 2022లో తొలిసారిగా పాల్గొన్న జాతీయ పోటీల్లోనూ కాంస్యంతో మెరిసింది. ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో నాసిక్‌లో జరగనున్న జాతీయ పోటీలకు, త్వరలో జపాన్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకూ సన్నద్ధమవుతోంది.

అందరి ప్రోత్సాహంతో ఉత్సాహం



వెస్ట్‌బెర్రీ స్కూలు నుంచి జంప్ రోప్ పోటీలకు కొందరు క్రీడాకారులు జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. వారిని చూశాక నేనూ ఆ స్థాయికి వెళ్లాలని సాధన చేశా. స్కూలు పీఈటీ సుబ్రహ్మణ్యం గైడెన్స్ తీసుకున్నా.

– యుక్తాశ్రీ

ఆర్టీసీలో అప్రంటీస్‌షిప్ జాబితా విడుదల

పట్నంబజారు: ఆర్టీసీలో ఐటీఐ అప్రంటీస్‌షిప్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ధృవపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల జాబితాను ఏపీఎస్ ఆర్టీసీ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ పొందుపరిచినట్లు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. సెలక్ట్ అయిన అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని జిల్లాల వారీగా విజయవాడ విద్యాధరపురం చెరువు సెంటర్ వద్ద ఉన్న జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కళాశాలకు రావాలని ఆయన సూచించారు. బాపట్ల జిల్లాకు చెందిన వారు ఈనెల 4న, గుంటూరు జిల్లా వారు 5న, పల్నాడు జిల్లా వారు 6న హాజరుకావాలని ఆయన తెలిపారు.

నేడు కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల

రెంటచింతల: కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల మహోత్సవానికి సిద్ధమైనట్లు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకల్లో కులమతాలకు అతీతంగా వేల మంది పాల్గొని కానుకమాత ఆశీస్సులు పొందాలని కోరారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు మొదటి దివ్యపూజాబలి సమర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప పీఠం అపోస్తలిక పాలనాధికారి డాక్టర్ గాలి బాలి, నల్గొండ పీఠం విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ గోవింద్ జోజి, 75 మందికి పైగా ఫాదర్లతో పండుగ పవిత్ర సమిష్టి మహోత్సవ దివ్యపూజాబలి నిర్వహించనున్నట్లు చెప్పారు.



వేడుకలకు సిద్ధమైన కానుకమాత చర్చి

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,800** గరిష్ఠం : రూ. **3,500**

మోడల్ ధర రూ. **3,100**

క్లుప్తంగా

కానిస్టేబుళ్లకు అర్హత సాధించిన 14 మంది హోంగార్డులు



నగరంపాలెం: స్థానిక పోలీస్ కవాతు మైదానంలో శనివారం పలు జిల్లాల్లో పని చేస్తున్న హోంగార్డులకు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మైదానానికి చేరుకుని పర్యవేక్షించారు. 40 మంది హాజరవ్వగా, ఏడుగురు ధ్రువపత్రాలు తీసుకురాలేదు. ముగ్గురికి శరీర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగతా 30 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించగా, 14 మంది ఉత్తీర్ణత సాధించారు. నలభై మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 11 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మిర్చి కమీషన్ వ్యాపారి మృతి



అనిల్‌కుమార్ (ఫైల్)

కారెంపూడి: లారీ ఢీకొని మిర్చి కమీషన్ వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల గ్రామ పెట్రోలు బంకు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గురజాల వైపు నుంచి కారెంపూడి బైక్‌పై వస్తుండగా పెట్రోలు బంకు వద్ద ఘటన జరిగింది. ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన ఆళ్ల అనిల్‌కుమార్ (24) కమీషన్ వ్యాపారి. బైక్‌పై వస్తుండగా బంకు వద్ద ఆగి ఉన్న కారు డోరు తీయడంతో డోరుకు తగిలి రోడ్డుపై పడ్డాడు. ఇంతలో అటుగా వచ్చిన లారీ ఢీకొని అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. సీఐ టీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పెదకాకానిలో విద్యార్థులతో కలసి ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ

ఫీజులు చెల్లించే వరకు
పోరాటం ఆగదు

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- ప్రతి విద్యార్థి ఫీజు పోరుకు సమాయత్తం కావాలని పిలుపు

పెదకాకాని: ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ అమలు కోసం పోరాడేందుకు ప్రతి విద్యార్థి ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఫిబ్రవరి 5వ తేదీన ఫీజుపోరు నిర్వహించనున్నట్లు చెప్పారు. పెదకాకాని గానుగ సెంటర్‌లో శనివారం ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాలుగు నెలలుగా బకాయిలు పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏ పేద విద్యార్థి చదువు ఆర్థికపరిస్థితుల కారణంగా ఆగకూడదని దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ఉన్నత చదువులు చదువుకొని ఎందరో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కార్పొరేట్ స్కూల్స్, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడమే కాకుండా కాలేజీల నుంచి ఇళ్లకు పంపిస్తున్నారని ఆరోపించారు. బకాయిలు చెల్లించి తక్షణమే ఈ పరిస్థితిని నివారించాలని కోరారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసి పనులకు వెళ్లే దుస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, దంతాల శివపార్వతి, బంగారు మరియమ్మ, సర్పంచులు గోళ్ల స్వరూపరాణి, పిట్టు శివ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు వినోద్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జోసఫ్, శ్యాంముఖర్జీ, చాగంటి మురళీమోహన్ రెడ్డి, తాడిబోయిన వేణుగోపాల్, శివాబత్తిన దయానంద్, రాంప్రసాద్, ఫ్రాన్సిస్, వేల్పుల నాగరాజు పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

- కక్షిదారులకు న్యాయం చేకూరేలా అధికారులు కృషి చేయాలి
- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేకూరేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్‌కోర్టు ప్రాంగణంలో మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని కోరుతూ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో న్యాయశాఖ ప్రతినెలా లోక్‌అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వపడేలా ఎదగాలి

- టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు
- విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన బాల మహోత్సవ్



బాల మహోత్సవ్ ముగింపులో మాట్లాడుతున్న టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

చేబ్రోలు: తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గుంటూరులోని టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్ శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలు, క్రియేటివిటీతో ముందుకు దూసుకుపోవాలని తెలిపారు. బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే అలవాటును పెంచుకోవాలని సూచించారు. జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నారో దాన్ని పొందే వరకు కృషి చేయాలని చెప్పారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమోషనల్‌గాను, మెంటల్‌గాను దృఢంగా ఉండాలని సూచించారు. ఓటములను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుని సంపూర్ణమైన వ్యక్తిత్వం సాధించాలని తెలిపారు. మారుతున్న జీవనశైలిలో ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపించాలని చెప్పారు.

వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. బాల మహోత్సవ్‌లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ స్కూల్స్ నుంచి ఐదు వేల మందికి పైగా విద్యార్థులు ఆయా క్రీడాంశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శ్రీధర్‌బాబు, చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్ తదితరులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

తాడేపల్లిలో గంజాయి కలకలం

యువకుడు, ఇద్దరు మహిళలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరోసారి గంజాయి విక్రయాలు బయటపడ్డాయి. పోలీసులు శనివారం చాకచక్యంగా వ్యవహరించి గంజాయి విక్రయిస్తున్న యువకుడు సహా కొనుగోలు చేస్తున్న ఇద్దరు పాత మహిళా నేరస్తులను అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో గుంటూరు జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ... "తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన గాజుల హరీష్‌కుమార్ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. మన్యం జిల్లా పాడేరు దగ్గర విజయకుమార్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసేవాడు. ఇక్కడికి తీసుకొచ్చి చిన్న పొట్లాలుగా మార్చి విక్రయిస్తున్నాడు. గంజాయి కేసుల్లో అరెస్టైన పాత నేరస్తులు నాగమణి, రోజాలు ఇటీవలే జైలు నుంచి విడుదలయ్యారు. వీరికి తాడేపల్లి రైల్వేస్టేషన్ వద్ద గాజుల హరీష్‌కుమార్ గంజాయి ఇస్తున్నాడని తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజుకు సమాచారం వచ్చింది. దీంతో ఆయన సిబ్బందితో మఫ్టీలో కాపు కాసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీ 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు" తెలిపారు. గంజాయి క్రయవిక్రయాలు చేసిన వారి గురించి ప్రజలు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సంక్షేమ పథకాలకు తూట్లు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైఎస్సార్ సీపీ పోరుబాట
- 'ఫీజు పోరు' పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి



ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి

తాడేపల్లిరూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలు ఆర్థికంగా ఎదగాలని అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆ పథకాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మంగళగిరి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు విమర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఈ నెల 5న చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని శనివారం పిలుపునిచ్చారు. ఈ మేరకు..'ఫీజు పోరు' పోస్టర్లను వారు ఆవిష్కరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అదే పథకాన్ని తల్లికి వందనం పేరుతో అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేశారని విమర్శించారు. వైఎస్ జగన్ సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తే.. కూటమి ప్రభుత్వం పరీక్షా కాలం వస్తున్నా ఇప్పటి వరకు చెల్లించలేదని, దీంతో ఫీజులు కట్టలేక విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, ఉపాధ్యక్షుడు పచ్చల రత్నకుమారి, యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు నాలి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

మాచవరం: వసతులు లేని హాస్టల్‌కు వెళ్లాలనే బాధతో ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విద్యార్థిని షేక్ గుల్జార్ (19) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. సరైన సౌకర్యాలు లేని కళాశాల వసతి గృహానికి మళ్లీ వెళ్లాల్సి వస్తోందనే బాధతో డిసెంబర్ 23వ తేదీన ఎలుకల మందు నీటిలో కలుపుకొని తాగింది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల, గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రులలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. విద్యార్థిని తండ్రి ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

డీపీఎంవో సారంగపాణి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నిజాంపట్నం: కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సారంగపాణి సూచించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా మండలంలోని ప్రజ్ఞం పంచాయతీ అట్లవారిపాలెంలో శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని రాగివర్ణ మచ్చలు ఉండినా, శరీరంపై రంగుమారిన మచ్చలు, పొడలు, లావుగా మారిన నరాలు, నొప్పులతో కూడిన నరాలు, కాళ్లు, చేతుల కండరాలలో బలహీనత, చేతులు, పాదాలు, నరాలలో తిమ్మిర్లు అనిపించటం, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవటం, చెవి తమ్మెలు మందంగా మారటం, చర్మం, చెవి తమ్మెలపై బుడిపెలు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యశాలలో సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. గ్రామంలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంవో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ మురళి, ఆశా కార్యకర్త రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.